

క్రైమ్ ఎఎస్‌పి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా క్రైమ్ ఆదనపు ఎస్‌పిగా పి.శ్రీనివాసరావు శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్‌పి క్యాంప్ కార్యాలయంలో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈయన ప్రస్తుతం కాశీబుగ్గ సబ్ డివిజన్ డిఎస్‌పిగా బాధ్యతలు నిర్వహిస్తూ... ఉద్యోగోన్నతిపై క్రైమ్ అదనపు ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాసరావు

ఏచూరి మృతి ఉద్యమాలకు తీరని లోటు



శ్రీకాకుళం అర్బన్ : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కమ్యూనిస్టు ఉద్యమ నేత సీతారాం ఏచూరి మృతి కమ్యూనిస్టు, ప్రజాతంత్ర, లౌకిక ఉద్యమాలకు తీరనిలోటని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గసభ్యులు బి.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సిపిఎం పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్క్సిజాన్ని భారతీయ పరిస్థితులకు వర్తింపచేసి విప్లవ శక్తులను కొత్త పుంతలు తొక్కించడానికి విరామ మెరుగక కృషిచేసిన వ్యక్తి సీతారాం ఏచూరి అన్నారు. 2011లో రెడ్డీస్ లేబరేటరీస్ కార్మికుల 100 రోజుల పోరాటం సందర్భంగా సీతారాం ఏచూరి పైడిభీమవరం వచ్చి కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలియజేశారని అన్నారు. ఐదు దశాబ్దాలుగా ఎన్నో పోరాటాలకు ఊపిరి పోసిన వ్యక్తన్నారు. ఈ సంతాప సభలో సిపిఐ నాయకులు కొన్న శ్రీనివాస్, సిపిఎం నాయకులు కె. మోహనరావు, జి.సింహాచలం, కె.శ్రీనివాస్, వి.జి.కె.మూర్తి, పి.తేజేశ్వరరావు, కె.అప్పారావు, భాస్కరరావు, లక్ష్మీ, శ్రీదేవి, వెంకటరావు, పాణిగ్రాహి ఎం.గోవర్ధనరావు, ఆది నారాయణమూర్తి, కే.సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన...

దేశంలో విద్యార్థి ఉద్యమాలకు దిక్సూచి సీతారాం ఏచూరి అని, ఆయన లేని లోటు పూడ్చలేనిదని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ రాజు పేర్కొన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో ఏచూరి చిత్ర పటానికి నివాళ్లర్పించారు.

రణస్థలం: కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి మరణం వామపక్ష, లౌకిక, ప్రజాస్వామ్య శక్తులకు, శ్రామిక వర్గానికి తీరనిలోటని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. శుక్రవారం పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో డా.రెడ్డీస్, శ్యాంపిస్టన్స్ ప్లాంట్ -2 పరిశ్రమల వద్ద, పైడిభీమవరం సిఐటియు కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి సంతాప సభలు నిర్వహించి నివాళ్లర్పించారు. ఆయనకు సంతాపంగా పైడిభీమవరం సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు జెండాను క్రిందికి దించి అవనతం చేశారు. ఈ సంతాప సభలో డా.రెడ్డీస్ లేబొరేటరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.రామకృష్ణ, బి.సురేష్, టి.వీర్రాజు, పున్నాన శ్రీను, సత్యన్నారాయణ, శ్యాంక్రగ్ పిస్టన్స్ (రింగ్స్) వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎమ్.అప్పలనర్సయ్య, నాయకులు ఎన్.నాగేశ్వరరావు, జీరు.రాము పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: ప్రజా పోరాటాలను నిర్మించడమే సీతారాం ఏచూరికి మన అర్పించే ఘన నివాళి అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. నాగార్జున అగ్రికం పరిశ్రమ వద్ద సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాగార్జున అగ్రికం కార్మిక సంఘం నాయకులు ఎల్.రామప్పడు, ఎం.రమణ, ఎ.సత్యనారాయణ, చిక్కాల. సత్యనారాయణ, గణపతిరావు, చిన్న, సుధాకర్, వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం లీగల్ : జిల్లా బార్ అసోసియేషన్ హాల్‌లో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు చమల్ల నర్సింహమూర్తి, బార్ కౌన్సెల్ మెంబర్ గేదెల వాసుదేవరావు, పొన్నాడ వెంకటరమణారావు, ఎన్.విజయకుమార్, ఎ.వెంకటేశ్వర్లు, కూన అన్నంనాయుడు, దుంపల రమణారావు, డొంకాన ఈశ్వరరావు, పి.లక్ష్మీపతి, ఇప్పిలి సీతారాం పాల్గొన్నారు.

మందస : మందస బస్టాండ్ వద్ద ఉన్న కళాశాలలో సీతారాం ఏచూరి చిత్రపటానికి వ్యాపార సంఘ నాయకులు గోపాలకృష్ణ, సిపిఎం నాయకులు ఆర్.దిలీప్ కుమార్, ఎస్.వల్లభ, ఎస్.చిరంజీవి, అల్లాడ కృష్ణ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

పలాస : స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు నాయకులు ఎన్.గణపతి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.అజయ్‌కుమార్, ఎం.లావణ్య, టి.సింహాద్రి, ఎన్.ఢిల్లేశ్వరి, జె.భాగ్యలక్ష్మి, జి.భాస్కరరావు పాల్గొన్నారు.

టెక్కలి : సీతారాం ఏచూరి మృతిపై నీటి సంఘ మాజీ అధ్యక్షులు సత్తారు వెంకటరమణ, డిసిసి మాజీ అధ్యక్షులు డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు, టిడిపి నాయకులు చాపర గణపతి, హనుమంతు రామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కోత మధుసూదనరావు, పొట్నూరు ఆనందరావు, మండల యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కార్యదర్శి పి.గణపతిరావు, తమ్మినేని వైకుంఠరావు, రోణంకి విజయ్‌కుమార్, డొంకాన పాపారావు, కుమారస్వామి, సీనియర్ నాయకులు పాలవలస ధర్మారావు, జిల్లా సహధ్యక్షులు కురమాన దాలయ్య, జనవిజ్ఞాన వేదిక నాయకులు కామేశ్వరరావు, డిటిఎఫ్ రాష్ట్ర నాయకులు కోత దర్మారావులు ఒక ప్రకటనలో సంతాపాన్ని వ్యక్తం చేశారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలో సీతారాం ఏచూరి చిత్రపటానికి యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు గొండు నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.



రణస్థలం : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు, కార్మికులు



శ్రీకాకుళం : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న న్యాయవాదులు

కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు వై.వాసుదేవరావు, గణపతిరావు, మన్మథరావు, ఆనందరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : సీతారాం ఏచూరి మృతి ప్రజాతంత్ర ఉద్యమానికి, కార్మిక, కర్షక ప్రజాసంఘాలకు తీరని లోటని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు అన్నారు. టెక్కలి సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హనుమంతు ఈశ్వరరావు, కొల్లి యల్లయ్య, ఉర్జాన లక్ష్మణరావు, దుర్గాప్రసాద్, న్యాయవాది మల్లేశ్వరరావు, నారాయణరావు, వైకుంఠరావు, దాలయ్య, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

సోంపేట : స్థానిక చౌడేశ్వరి కళ్యాణ మండపంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సంగారు లక్ష్మీనారాయణ, డి.కృష్ణారావు, కె.గోపీనాథ్, చిరంజీవి, నెయ్యిల విజయకుమార్, ఎస్.హైమావతి, దానేశ్వరి, సరోజని, కె.రాజు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కృష్ణమూర్తి తదితరులు

'ప్రజాశక్తి' కార్యాలయంలో...

శ్రీకాకుళం అర్బన్ ఏచూరి చేసిన ఐదు దశాబ్ధాల రాజకీయ అధ్యయనం మార్క్సిస్టు ఉద్యమానికి బలాన్ని చేకూర్చిందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి అన్నారు. ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో ఎడివిటి ఇన్‌ఛార్జి బుజ్జిబాబు అధ్యక్షతన సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ కామినాయుడు మాట్లాడుతూ పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా మార్క్సిస్టు ఉద్యమానికి అంతర్జాతీయ స్థాయిలో ఏచూరి జీవం పోశారని గుర్తు చేశారు. ఈ సభలో సోమశేఖర్ ప్రారంభోపన్యాసం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



ఎచ్చెర్ల : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు, కార్మికులు



టెక్కలి రూరల్ : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు



సోంపేట : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు



పలాస : చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



కోటబొమ్మాళి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు



మందస : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

డ్రగ్స్ రహిత జిల్లాకు కృషి

కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

డ్రగ్స్, గంజాయి రహిత ప్రాంతంగా జిల్లాను మార్చేందుకు, యువత ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసే వాటి వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డిలు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ (ఎన్‌సిఒఆర్‌డి) కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం, వాటికి సంబంధించిన ఫిర్యాదుల నమోదు, అలాగే డి-అడిషన్ కేంద్రాల సేవలకు టోల్ ఫ్రీ నంబరు 14446 అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. సమస్యలు, ఫిర్యాదులు ఈ నంబరు ద్వారా తెలియజేయాలని ప్రజలకు సూచించారు. రిమ్స్‌లో డి-అడిక్షన్ సెంటర్‌ను పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని రంగస్థల కళాకారులు, సోషల్ మీడియా, ఎన్‌జిఒల సహకారంతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన చేపడతామన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ గంజాయి విక్రయాలు, వినియోగం జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ ఏడాది గంజాయి విక్రయిస్తున్న 50 మందిపై సస్పెక్ట్ షీట్, ఏడుగురిపై రౌడీషీట్ తెరిచామన్నారు. యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసి, 184 కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 391 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, 17మంది నిందితులను అరెస్టు చేసినట్టు వివరించారు. ప్రభుత్వ శాఖల సమన్వయం కట్టడికి మరింత కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, భరత్‌నాయక్, డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద, శ్రీనివాసరావు, డిఎంహెచ్‌ఒ బొడ్డేపల్లి మీనాక్షి, జిల్లా వ్యవసాయ అధికారి కె.శ్రీధర్, డిటిసి చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వివిధ పనుల కోసం తన దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరి సమస్యా పరిష్కరించి న్యాయం చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హామీనిచ్చారు. మండలంలోని నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజా దర్బారు నిర్వహించారు. నియోజకవర్గంలోని టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల నుంచి వచ్చిన ప్రజలు నుంచి ఆయన వినతులు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సమస్యలకు సంబంధించిన అధికారులతో మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే విడతల వారీగా పరిష్కరిస్తానని కార్యకర్తలకు సూచించారు. ఇక నుంచి ఉదయం పూట కార్యకర్తలు, ప్రజలు సమస్యలు వినతలు తీసుకుంటానని, రెండో పూట గ్రామాల్లో పర్యటించి పరిస్థితులను తెలుసుకొని పరిష్కరిస్తానని చెప్పారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రానైట్ పరిశ్రమ యజమానులు

కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, వెలమల కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రానైట్ పర్మిట్లు మంజూరు చేయాలి

జిల్లాలోని గ్రానైట్ క్వారీల నుంచి పర్మిట్లు మంజూరు చేయాలని గ్రానైట్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. అంతర్జాతీయ స్థాయిలో బ్లూ గ్రానైట్ ఎగుమతికి అనుమతులు మంజూరు చేయాలన్నారు. గత నాలుగు నెలల పర్మిట్లు మంజూరు చేయకపోవడంతో పరిశ్రమల యాజమాన్యాలు ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నాయన్నారు. బ్యాంకు రుణాలు కట్టడానికీ ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మంత్రి స్పందించి వెంటనే ఫోన్‌లో గనుల శాఖమంత్రి కొల్లు రవీంద్రతో మాట్లాడారు. అనంతరం మైన్స్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి పర్మిట్లు మంజూరు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రతినిధులు కింజరాపు సురేష్, పోలాకి చంద్రశేఖర్, అల్లు నగేష్, గండి సూర్యనారాయణరెడ్డి, నవీన్ చౌదరి, దొడ్ల మహేష్, లారీ సంఘాల తరుపున దాసరి వెంకటేశ్వరరావు, ఎర్ర అబ్బాయి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు నిమ్మాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు చింతాడ లక్ష్మణరావు, జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు యు.ఎస్.ఎస్.ఎస్.దేవిలను నిమ్మాడ తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి దుశ్శాలువ కప్పి సన్మానించారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై ఆదర్శంగా నిలవడంతో వారికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కింజరాపు సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తంగి వెంకటరమణ మూర్తి, శ్రీనివాసరావు, గోవిందబాబా, చిన్నారావు, గిరిజాలక్ష్మిలు పాల్గొన్నారు.

దాడులను అరికట్టాలి

మాజీ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైసిపి నాయకులపై, కార్యకర్తలపై ఉద్దేశపూర్వకంగా దాడులు చేస్తున్నారని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి న్యాయం చేయాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు కోరారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేసన్‌లో ఎస్‌పి మహేశ్వర రెడ్డి శుక్రవారం నిర్వహించిన ప్రజా వేదికలో ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఘటనలపై ఆధారాలతో సహా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసులు నమోదు చేయడంలేదన్నారు. దాడులు చేసిన వారికి విడిచిపెట్టి బాధితులకు ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగా ఇటీవల హరిపురంలో వైసిపి నాయకుడు విద్యుత్ షాపు కాల్చివేత, పలాస మండలం బొడ్డపాడులో వైసిపి కార్యకర్తపై దాడి జరిగిందన్నారు. అయినా వారికి న్యాయం జరగలేదన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా పేదలకు, జర్నలిస్టులకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని, అదే క్రమంలో పలాసలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చామని స్పష్టం చేశారు. కలెక్టర్, ఆర్‌డిఒ ఆదేశాల మేరకే ఇచ్చాం తప్ప ఇందులో అవకతవకలకు తోవలేదన్నారు. వైసిపి కార్యకర్తలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు.



విలేకరులలో మాట్లాడుతున్న అప్పలరాజు

పారదర్శకంగా బదిలీలు

ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా కోరినచోట పారదర్శకంగా గ్రామ, వార్డు మహిళా పోలీసులు బదిలీలు నిర్వహించాలని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి సూచించారు. ఎస్‌పి కార్యాలయంలో సాధారణ బదిలీలో భాగంగా జిల్లాలో వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులకు ఎస్‌పి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు, గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి పి.వాసుదేవరావులు శుక్రవారం బదిలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తానికి 238 మంది మహిళా పోలీసులు ఆన్‌లైన్‌లో బదిలీకు దరఖాస్తు చేసుకోగా, 71 మందికి బదిలీలు చేశామని అన్నారు. 149 మంది యథావిధి స్థానాల్లో కొనసాగడానికి అంగీకారం తెలిపారని అన్నారు. 18 మంది గైరాజరయ్యారన్నారు. ఈ క్రమంలో ముందుగా మ్యూచువల్ ట్రాన్స్ఫర్, స్పౌస్ కోటా, ఆరోగ్య పరమైన సమస్యలు ప్రాతిపదికన ముందుగా బదిలీలు చేపట్టామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు మహిళా పోలీసులకు నిబంధనలు అనుసరించి కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా వారు కోరుకున్న చోటుకు బదిలీ చేశామన్నారు. బదిలీలకు ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలు మేరకే చేస్తామన్నారు. పోస్టింగ్ కోరుకునే ఉద్యోగిని తన స్వగ్రామం, వార్డు ఉండే సచివాలయం మినహా ఇతర సచివాలయాలను కోరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు కార్యాలయం ఆఫీస్ సూపరింటెండెంట్ కోటీశ్వరరావు, సిబ్బంది, ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు బదిలీ



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా పరిషత్ సిఇఒగా పనిచేస్తున్న డి.వెంకటేశ్వరరావును మాతృశాఖ అయిన రెవెన్యూశాఖకు బదిలీ చేస్తూ ప్రభుత్వం జిఒ నెంబరు 519, 520 జారీ చేసింది. విజయవాడలో రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. డెప్యూటీ సిఇఒగా ఉన్న రావాడ వెంకటరామన్‌కు పూర్తి అదనపు బాధ్యతల్లో సిఇఒగా నియమించారు. పంచాయతీరాజ్ ఎన్నికల సమయంలో సిఇఒగా అప్పటి ప్రభుత్వం ప్రస్తుత డిఆర్ఒ అప్పారావును నియమించింది. ఆయన విధుల్లో చేరకపోవడంతో వెంకటరామన్ సిఇఒగా కొనసాగారు. తిరిగి సార్వత్రిక ఎన్నికల సమయానికి ముందు సిఇఒగా వెంకటేశ్వరరావును ప్రభుత్వం నియమించింది. ఎన్నికల అనంతరం కొత్త ప్రభుత్వం కొలువు తీరిన మూడు నెలల వ్యవధిలో ఆయనను మాతృశాఖకు బదిలీ చేస్తూ తిరిగి వెంకటరాన్‌కు బాధ్యతలను అప్పగించారు. బదిలీపై వెళ్తున్న సిఇఒ వెంకటేశ్వరరావును పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులు శుక్రవారం రాత్రి జెడ్‌పి సమావేశమందిరంలో వీడ్కోలు పలికారు.

మంచమెక్కిన నందికొండ

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రధాన రహదారి అవతలి వైపు ఉన్న నందికొండ కాలనీలో జ్వరాలు హడాలెత్తిస్తున్నాయి. శుక్రవారం కాలనీలోని ఒక వీధికి చెందిన జ్వర పీడితుల వివరాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సంతోష్‌కుమార్ ఆధ్వర్యాన సేకరించి ప్రాథమిక వైద్య సేవలు అందించారు. ఇదే కాలనీకి చెందిన పట్నాన వేణుశ్రీ ఎల్ఎన్‌పేట వసతిగృహంలో 8వ తరగతి చదువుతోంది. ఇటీవల స్వగృహానికి వచ్చి జ్వరం బారిన పడడంతో పిహెచ్‌సిలో వైద్య సేవలకు వెళ్లింది. ప్రాథమిక వైద్య సేవల అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆమదాలవలసలోని జొన్నవలస 30 పడకల ఆస్పత్రికి వైద్య సిబ్బంది రిఫర్ చేశారు. అక్కడ రక్త పరీక్షలు నిర్వహించిన వైద్య సిబ్బంది వేణుశ్రీకి డెంగీ లక్షణాలు ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేసి మెరుగైన రక్త పరీక్షలతో పాటు వైద్య చికిత్స నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి పంపించారు. అక్కడ రక్త పరీక్షలు నిర్వహించిన వైద్యులు బాలికకు డెంగీ లక్షణాలు ఉన్నట్లు నిర్ధారించారు. అనంతరం వేణుశ్రీకి జొన్నవలస ఆస్పత్రిలోనే వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రస్తుతం జ్వర పీడిత బాలికకు వైద్య సేవలు అందిస్తున్నారు. అలాగే నందికొండ కాలనీకి చెందిన పెరుమాళ్ల అప్పారావు, చెల్లమ్మ అనే భార్యాభర్తలూ జ్వరం బారిన పడి నిరసించడంతో స్థానిక పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్నారు. డెంగీ లక్షణాలు నిర్ధారణ కావడంతో వెంటనే స్థానిక పిహెచ్‌సి వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించి జ్వర పీడితుల వివరాలు సేకరించారు. కాలనీకి చెందిన సుమారు 25 మంది జ్వరాల బారిన పడినట్లు వైద్య పరీక్షల ద్వారా తేలింది. అలాగే జరపీడుతులందరికీ స్థానిక పిహెచ్‌సిలో రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మేరకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఇతర ప్రభుత్వాస్పత్రికి పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు.



పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న రోగులు


బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని మబగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల లెవెల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన రెండు రోజుల పాటు గ్రిగ్ మీట్ ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీల్లో గెలుపోటములు సహజమేమని, ఓటమి గెలుపుకు పునాది అని అన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు లింగరాజు, శ్రీనివాస్ నాయిక్, ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణన్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న విసి రజని

విద్యార్థినికి అభినందనలు

ఎచ్చెర్ల: రాష్ట్రస్థాయిలో కళాశాల, విశ్వవిద్యాలయాల విద్యార్థులకు రామకృష్ణ మిషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం విద్యార్థిని ప్రతిభ కనపర్చింది. వర్శిటీ విద్యావిభాగంలోని బి.ఇడి (స్పెషల్) విద్యార్థిని జామి శిరీషా 'స్వామి వివేకానంద - విశిష్టమైన భారతీయ సంస్కృతి' అనే అంశంపై రాసిన వ్యాసానికి నాలుగో బహుమతి లభించింది. శిరీషా ఈ బహుమతి అందుకోవడంతో వైస్ ఛాన్సలర్ కె.ఆర్.రజని శుక్రవారం తన ఛాంబర్‌లో అభినందించారు. కార్యక్రమంలో విద్యావిభాగం సమన్వకర్త డా. హెచ్.సుబ్రహ్మణ్యం, డా. జె.ఎల్. సంధ్యారాణి పాల్గొన్నారు.



జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలకు తరలివెళ్తున్న జిల్లా నాయకులు

జెవివి మహాసభలకు పయనం

ఆమదాలవలస: ఈ నెల 14, 15 తేదీల్లో అనంతపురం జిల్లాలో జరగనున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలకు జిల్లా నాయకులు తరలివెళ్లారు. శుక్రవారం శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ నుంచి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో అనంతపురానికి బయలుదేరి వెళ్లారు. ఈ సభలకు బొడ్డేపల్లి మోహనరావు, కుప్పిలి కామేశ్వరరావు, పి.కూర్మారావు, బొడ్డేపల్లి జనార్ధనరావు, పాలవలస ధర్మారావు, సామ సంజీవరావు, ఆర్.సురేష్‌బాబు, బి.కాశీవిశ్వనాథ్, బి.ధనలక్ష్మి, పేడాడ వేదవతి, గొంటి గిరిధర్ తదితరులు వెళ్లారు.

శ్రీకాంత్ పరామర్శ

పాతపట్నం : విలేకరి తొణంగి నిరంజన్ పట్నాయక్ సోదరుడు సుధాకర్ పట్నాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తూర్పు కాపు మాజీ అధ్యక్షులు మామిడి శ్రీకాంత్ నిరంజన్ పట్నాయక్‌ను శుక్రవారం పరామర్శించారు. అనంతరం చిన్నలోగిడి, పెదసీది గ్రామాల్లోని మృతి చెందిన వైసిపి నాయకుల కుటుంబాలను పరామర్శించారు. పెద్దసిదికి చెందిన రావాడ అప్పన్నమ్మ అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆమెను పరామర్శించారు.

జాతీయ సమైక్యతకు ప్రతీక హిందీ


శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న సూర్యచంద్రరావు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

బహుళ భాషలు గల భారత దేశంలో ప్రజలందరినీ ఏకత్రాటిపైకి తెచ్చి జాతీయ సమైక్యతకు ప్రతీకగా హిందీ భాష నిలిచిందని బోరుభద్ర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ అన్నారు. హిందీ ఉపాధ్యాయుని దేవగుప్తపు ఉమాదేవి, బాదిరెడ్డి నాగమణిల ఆధ్వర్యాన జాతీయ హిందీ దినోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ అధ్యాపకులు డి.ఉమాదేవి, బి.నాగమణి మాట్లాడుతూ గాంధీజీ స్ఫూర్తితో జాతీయ భాష గా హిందీని రాజ్యాంగం గుర్తించిన సెప్టెంబరు 14న జాతీయ హిందీ దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా మారిందన్నారు. విద్యార్థులు హిందీలో మొదటి అక్షరం 'अ' ఆకృతిలో మానవహారంగా ఏర్పడ్డారు. గత పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాల తో పాటు అత్యధికంగా 100కి 99 మార్కులు సాధించడంలో కృషి చేసిన హిందీ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.లోకేశ్వరరావు, డి.ఉమాశంకర్, వెంకటరెడ్డి, కె.త్రినాథరావు పాల్గొన్నారు.

నరసన్నపేట : హిందీ భాష గొప్పదని భాష పాచుర్యాన్ని ప్రతి విద్యార్థికీ వివరించవలసిన అవసరం ఉందని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బోర్డు) ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక బోర్డు స్కూల్లో శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్ర ప్రోత్సాహంతో మూలపేట వివేకానంద యువజన సేవా సంఘం ఆధ్వర్యాన శుక్రవారం హిందీ భాష దినోత్సవాన్ని నిర్వహించారు. హిందీ అధ్యాపకులు కృష్ణారావు మాట్లాడుతూ మాతృ భాషతో పాటు హిందీ కూడా నేర్చుకొని ఎంత అవసరం అన్నారు. హిందీ భాషా దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు వ్యాచరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి నెహ్రూ యువ కేంద్ర సహాయపతులు గుండు వెంకటరమణ, ఉమామహేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించి జాతీయ హిందీ దినోత్సవంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.వి.రమణారావు, ఉపాధ్యాయులు బి.చిన్నారావు, వి.విష్ణాచారి పాల్గొన్నారు. అలాగే రామకృష్ణాపురంలోని సత్యసాయి విద్యా విహార్‌లో హిందీ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతీచౌదరి, హిందీ ఉపాధ్యాయులు హేమంత్, హేమ, లలిత, జయ, కల్పన పాల్గొన్నారు.

కవిటి: మాతభాష తెలుగుతో పాటు జాతీయ భాష హిందీ కూడా ప్రతి విద్యార్థీ నేర్చుకోవాలని బి.జి.పుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాబూరావు అన్నారు. హిందీ దివస్ వేడుకలు శుక్రవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయులు జానకి దుశ్శాలు కప్పి సన్మానించారు.


సంతబొమ్మాళి : హిందీలో ఆ అక్షరం రూపంలో కూర్చున్న విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్: ప్రభుత్వ మహిళ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యాన 'హిందీ దివస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు హాజరై మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మన జాతీయ భాషగా ఉన్న హిందీకి గుర్తింపు ఉందని, అనేక దేశాల్లో ఈ బాషను మాట్లాడతారన్నారు. హిందీ భాషను 'లాంగ్వేజ్ ఆఫ్ యూనిటీ' అని పిలుస్తారన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు శ్రీనివాసరావు పాత్రో, హిందీ విభాగ అధ్యాపకులు పి.పార్వతి, అకడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి పాల్గొన్నారు.

టేకు చెట్లపై ఉత్తుత్తి విచారణ


టేకు దుంగలను పరిశీలిస్తున్న సెక్షన్ ఆఫీసర్ సాయికుమార్

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని తోటవాడ పంచాయతీ పరిధిలో కొల్లివలస సమీపంలో వున్న రియల్ ఎస్టేట్ భూముల్లో 'యథేచ్ఛగా టేకు చెట్లు నరికివేత' అనే శీర్షికతో శుక్రవారం జిల్లా టాబ్లయిడ్‌లో ప్రచురితమైన వార్తపై అటవీశాఖ అధికారులు స్పందించారు. అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ సాయికుమార్ సందర్శించారు. రియల్ ఎస్టేట్ నిర్వాహకులు చెట్లు నరికివేతపై అనుమతులు తీసుకున్నారా లేదా అన్న విషయాలపై ఆరా తీశారు. ఎక్కడైనా అనుమతులు లేకుండా చెట్లు నరికి వేసినా, తరలించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీశాఖ అధికారులు ఉత్తుత్తి విచారణ చేసి వెళ్లిపోయినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'ప్రజాశక్తి' విలేకరికి బెదిరింపులు

తోటవాడ రియల్ ఎస్టేట్‌లో టేకు చెట్ల నరికి వేతపై వార్త రాసిన బూర్జ విలేకరి ఐ.వాసుదేవరావును పలువురు దళారులు శుక్రవారం ఫోన్‌లో బెదిరించారు. ఫలానా చోటకు రావాలని మాట్లాడతామంటూ రోజంతా ఫోన్లు చేస్తూనే ఉన్నారు. టేకు చెట్లపై తమకు లెక్కలు చెప్పాలంటూ హుకంరించారు. దీని వెనుక రియల్ ఎస్టేట్ యాజమాన్యం హస్తం ముందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

బోన్‌మారో మార్పిడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బోన్‌మారో వ్యాధితో బాధపడుతున్న ఆమదాలవలస మండలానికి చెందిన కుద్దిరాం గ్రామస్తులు అల్లు హరి కుమార్తె భవాని డిస్ప్లేట్రిక్స్ సింట్రోమ్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతుందని తెలుసుకుని ఆమె వైద్య ఖర్చుల కోసం శ్రీకాకుళం మున్సిపల్ కాంట్రక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన రూ.75, 500 ఆర్థికసాయాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ చేతులమీదుగా అందజేశారు. వైద్యుల సలహా మేరకు ఆమె శస్త్ర చికిత్స కోసం రూ.20లక్షల వరకు ఖర్చవుతుందని తెలుసుకుని వారు స్పందించారు. చెక్కును బాధితురాలి తల్లిదండ్రులకు అందజేశారు. ఎమ్మెల్యే స్పందించి వైద్యానికి అవసరమైన ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సమకూర్చేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రెడ్డి గిరిజ శంకర్, గొండు శ్యామ్, శ్రీకాకుళం మున్సిపల్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

లడ్డూ @ రూ.50 వేలు

ప్రజాశక్తి- కవిటి


లడ్డూతో బాలరాజు

కవిటి ఆస్పత్రి రోడ్డు పల్లివీధిలో రైజింగ్ స్టార్ యూత్ ఆధ్వర్యాన వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన లడ్డూ వేలంలో పందిరి బాలరాజు సోదరులు రూ.50 వేలకు లడ్డూ సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో పెద్దలు పి.లక్ష్మణమూర్తి, పి.దేవరాజు, సింహాచలం, యూత్ సభ్యులు ఎన్.శ్రీధర్, యోగి, ప్రకాష్, రాజారావు, పందిరి రమేష్, అశోక్, దశ లక్ష్మణ్, దానయ్య, మధు, బాపూజీ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ఎపి జీడి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వం పెట్టుబడుల సహాయం కింద అందజేస్తామన్న రూ.25 వేలు తక్షణం ఇవ్వాలని ఎపి జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని మాకనపల్లి గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం రైతు సంఘ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం సచివాలయ ఉద్యోగులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో కరువు, తుపాన్లతో నష్టపోయిన పంటలకు బీమా పరిహారం చెల్లించాలన్నారు. ఉచిత పంటల బీమా అందించాలన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలన్నారు. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి జిఒ 11 విడుదల చేయాలన్నారు తిత్లీ తుపానులో నష్టపోయిన జీడి, కొబ్బరి ఏడువేల మంది రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.2 లక్షల లోపు ఉన్న రుణాలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ మీటర్లకు ఇచ్చిన జిఒను 22ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో గార రుద్రయ్య, రాపాక చిన్నారావు, రత్నాల తేజేశ్వరరావు, జుత్తు కిషోర్, నాగు, జీవనరావు, కూర్మారావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విజిలెన్స్ ఎస్‌పిగా బాధ్యతల స్వీకరణ


ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా విజిలెన్స్ ఎస్‌పిగా బర్ల ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం విజిలెన్స్ ఎస్‌పిగా ఉన్న సురేష్ బాబును ఆ బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పించి ప్రసాదరావుకు బాధ్యతలు అప్పగించింది. గతంలో సబ్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్ కేడర్లలో వివిధ పోలీసుస్టేషన్లలో పనిచేసిన ఆయన ఎస్‌పి స్థాయిలో తిరిగి నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

మెప్మా పీడీగా రమణ


రమణ, మెప్మా పీడీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మెప్మా పీడీగా ఎఒ ఎస్.వి.రమణకు ఇన్‌ఛార్జి అదనపు బాధ్యతల్లో ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు పీడీగా ఉన్న ఎం.కిరణ్‌కుమార్ మాతృ సంస్థకు బదిలీ అయ్యారు. గడచిన ఆరేళ్లుగా మెప్మా పీడీగా పని చేసిన ఆయనను ఇటీవల ప్రభుత్వం రిలీవ్ చేసింది. పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో ఆయన రిపోర్టు చేయాల్సి ఉంది. ఆయన స్థానంలో ఎస్.వి.రమణను నియమించడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు.


ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

వసతిగృహం ప్రారంభం

ప్రజాశక్తి- పాతపట్నం

నీలమణి దుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పద్ద లోకేశ్వరావు, కరుణ దంపతులు ఆలయ ప్రాంగణంలో వసతిగృహాన్ని నిర్మించారు. దీనిని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పైల బాబ్జి, నాయకులు పాల్గొన్నారు.


విచారణ చేపడుతున్న శ్రీకాంత్

'ఆశా' ఆత్మహత్యాయత్నంపై విచారణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని కె.కొత్తూరు పిహెచ్‌సి పరిధి టెక్కలి సచివాలయం-3లో పనిచేస్తున్న ఆశావర్కర్ల సరస్వతి ఆత్మహత్యాత్నంపై అదనపు డిహెచ్ఎంఒ డాక్టర్ డి.శ్రీకాంత్ ఎఎన్ఎంలతో, ఆశా కార్యకర్తలో శుక్రవారం విచారణ చేపట్టారు. ఎఎన్ఎం వైఖరిపై ఆరోపిస్తూ ఆశా కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడానికి కారణలను ఇరువురి నుంచీ అబిప్రాయాలను సేకరించారు. ఈ నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని శ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శిష్టు గాయత్రి పాల్గొన్నారు.

ఒత్తిడి చేయడం తగదు

ప్రజాశక్తి- పొందూరు

సుమారు నాలుగేళ్ల క్రితం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన విసిఆర్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలకు అందించిన డెల్ కంపెనీ ల్యాప్‌టాప్‌లను తిరిగి అప్పగించాలని ఒత్తిడి చేయడం తగదని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఈ ల్యాప్ టాప్‌లను పాఠశాలల్లో అనేక ఆన్‌లైన్ పనులకు హెచ్ఎంలు ఉపయోగిస్తున్నారని, ఉపయోగంలో ఉన్న ల్యాప్ టాప్‌లను హెచ్.ఎంలపై ఒత్తిడి తెచ్చి తిరిగి ఇమ్మనడం ఎంతవరకు సమంజసమని అధికారులను ప్రశ్నిస్తున్నారు. గత రెండేళ్లుగా ఎటువంటి నిధులు మంజూరు చేయకపోగా అవసరాలకు ఉపయోగపడుతూ వినియోగంలో ఉన్న వాటిని అందుబాటులో లేకుండా చేయడం తగదన్నారు. చాలా పాఠశాలల్లో సొంత ఖర్చులతో ప్రింటర్‌లను కూడా సమకూర్చుకొని వాడకం చేస్తుండగా అర్ధాంతరంగా తిరిగి అప్పగించాలని చెప్పడంలో అర్థం లేదన్నారు. ప్రస్తుతం ఉన్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌తో డిజిటల్ బోధన జరుగుతున్నప్పటికీ ఆఫీసు పనికి ఉపయోగపడదు కాబట్టి ల్యాప్ టాప్‌లను తిరిగి అప్పగించాలనే అధికారుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు.

ట్రాఫిక్‌జామ్ నిత్యకృత్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండల పరిధిలోని కొత్తరోడ్డు వద్ద ట్రాఫిక్ జామ్ నిత్యకృత్యంగా మారింది. శుక్రవారం ఉదయం గుంతల్లో భారీ వాహనాలు దిగబడడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. కొత్త రోడ్డు ముందర ఉన్న గెడ్డకు ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం ఉద్యోగులు ఆఫీసులకు వెళ్లే సమయం, విద్యార్థులు కాలేజీలకు వెళ్లే సమయంలో గంటల తరబడి రద్దీ ఏర్పడి ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోవడంతో ఉద్యోగులు, విద్యార్థులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వాహనాలు నిలిచి ట్రాఫిక్ ఆగిపోవడంతో శ్రీకాకుళం రూరల్, ఆమదాలవలస పోలీసులు అక్కడకు చేరుకొని గుంతల్లో దిగబడిన లారీలను క్రేన్ల సహాయంతో తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. దీంతో వాహనదారులంతా ఊపిరి పీల్చుకున్నారు. చత్తీస్‌ఘడ్, ఒడిషా రాష్ట్రాల నుంచి వచ్చే భారీ వాహనాలు శ్రీకాకుళం - ఆమదాలవలస మీదుగా పాలకొండ వైపు వెళ్తుండడం, కొత్త రోడ్డు ముందర ఉన్న గెడ్డ వద్ద రహదారి చిన్నగా ఉండడంతో వాహనదారులు ఒకేసారి ఇరువైపుల నుంచి దూసుకు వస్తుండడంతో అక్కడ రద్దీ ఏర్పడి ఎక్కడి వాహనాలు అక్కడే గంటల తరబడి నిలిచిపోతున్నాయి.


గోతిలో దిగబడిన లారీ

ఘనంగా తాతముత్తాల దినోత్సవం


టెక్కలి : తాతముత్తాలను గౌరవిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- టెక్కలి

విద్యార్థులు తరాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని రవీంద్ర భారతి పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పద్మజ అన్నారు. స్థానిక పాఠశాలలో శుక్రవారం తాత ముత్తాతల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవస్థలో సమిష్టి కుటుంబాలకు ప్రాధాన్యతనిచ్చి ఆప్యాయత అనురాగాలకు అవకాశాలు కల్పించే విధంగా తల్లిదండ్రులు పిల్లలను చూడాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థులు తాత ముత్తాతలను సత్కరించి గౌరవించారు

నరసన్నపేట : స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో నిర్వహించిన గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు 150 మంది పాల్గొన్నారు. పిల్లవాడిని ఎవరు ఎక్కువగా ముద్దుగా చూసుకుంటారని అడిగినప్పుడల్లా చాలామంది తాతయ్య అనే సమాధానం చెబుతారు. అందులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ప్రిన్సిపాల్ పి.వాసుదేవరావు తెలిపారు.

కష్టపడే వారికి గుర్తింపు


సన్మానిస్తున్న ఎంఇఒ వెంకటరమణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థుల ఉన్నతికి కష్టపడే ఉపాధ్యాయులకు తప్పకుండా గుర్తింపు లభిస్తుందని ఎంఇఒ బి.వెంకటరమణ అన్నారు. మండలంలోని మంచినీళ్లపేట ప్రాథమిక పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొప్పల రామచంద్రుడుకు శుక్రవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబద్ధత కలిగిన ఉపాధ్యాయులకు సమాజంలోనూ అధికరపరంగా గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రతి ఉపాధ్యాయడూ విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి పాటు పడాలని కోరారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ అవార్డు మరింత బాధ్యత పెంచిందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు చిట్టిబాబు, జయరాం, హుకుంపేట ప్రధానోపాధ్యాయులు కళ్యాణి, గ్రామస్తులు గుళ్ల చిన్నారావు, సన్నా మాధవరావు, ఆకుల పాపారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- లావేరు

బుడుమూరు జెడ్‌పి పాఠశాలలో రిమ్స్ ఆస్పత్రి ఆప్తాలమిస్ట్ ఉప్పు ఉమహేశ్వరరావు శుక్రవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. తొమ్మిది మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి మూడుసార్లు ఆకుకూరలు తీసుకోవాలని, జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉరిటి శ్రీనువాసరావు, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పూజారి గోవిందరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని మామిడివలస జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో 55 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా అవసరమైన ఐ డ్రాప్స్ అందజేశారు, కార్యక్రమంలో పిఎంఒఒ ప్రతాప్, సిహెచ్ఒ ఎ.అప్పలస్వామి, హెచ్ఎం ఎం.అనిత, ఎఎన్ఎం బి.లత, ఎంఎంఎల్‌హెచ్ఒ అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.



లావేరు : విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కేశవరావు కుటుంబానికి న్యాయం చేయాలి

ఎస్‌పిని కోరిన ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

మందస మండలం నల్లబొడ్లూరుకు చెందిన మాజీ మావోయిస్టు దున్న కేశవరావు కుటుంబానికి న్యాయం చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కేశరావు తల్లి కాములమ్మతో కలిసి ఆయన వృత్తాంతాన్ని వివరించారు. 2011లో కేశవరావు జనజీవన స్రవంతిలో ప్రభుత్వ హయాంలో కలిసిపోయారని వివరించారు. ఆ వెంటనే ఒడిశా రాష్ట్ర పోలీసులు తీసుకెళ్లిపోయారని, అప్పటి నుంచి ఇప్పటి వరకు విడిచిపెట్టలేదని అన్నారు. అప్పటి నుంచి ఆయన తల్లి, కుమారుడు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిపై ఎస్‌పి స్పందిస్తూ... ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

పౌష్టికాహారం పంపిణీ


మందస : సీమంతాలు చేస్తున్న వసుంధరాదేవి

మందస : మండలంలోని హరిపురం- 2వ సెక్టర్ జగన్నాథపురంలో సైఇటిఎస్ సిపిడిఒ కె.వసుంధరాదేవి ఆధ్వర్యాన పోషికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి ఆరేళ్ల వయసు పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. సూపర్‌వైజర్ బి.మంగమ్మ, సిహెచ్.వి.రాజ్యలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పలాస : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని టిడిపి నాయకులు వడ్డీ యాదగిరి, ఆళ్ల వెంకటరావు, బమ్మిడి ఆనందరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్లా అంగన్వాడీలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మణ రేఖ, ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్ ఆర్.అరుణకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు తులసి, ఎన్.జానకి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : స్థానిక 4,5 వార్డులు మేర్జింగ్, స్వేచ్ఛావతి, కంద్రవీధి, కాలనీ, భవానీపురం, పురుషోత్తం-3 అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి నాగారాణి, కౌన్సిలర్ నారాయణ బెహరా పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : పౌష్టికాహారాన్ని అందజేస్తున్న రాజు

రోడ్డు మూసివేస్తే సహించేది లేదు


నిరసన తెలుపుతున్న స్థానికులు

ప్రజాశక్తి- టెక్కలి

మండలంలోని లింగాలవలస పంచాయతీ బంజీరుపేట, సొర్లిగాం, సవరసొర్లిగాం, హరిపురం, వంగర, సన్యాసిపేట గ్రామాలకు వెళ్లే రోడ్డు మూసివేస్తే సహిది లేదని ఆయా గ్రామస్తులు హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామాలకు వెళ్లే రోడ్డు వద్ద ఉన్న రైల్వే ట్రాక్ పనులను శుక్రవారం అడ్డుకున్నారు. తమ గ్రామాలకు పూర్తి స్థాయిలో రహదారి సౌకర్యం కల్పించి రైల్వే ట్రాక్ మీదుగా ఉన్న రోడ్డును మూసివేసుకోవచ్చునని అన్నారు. దశాబ్ధాల కాలం నుంచి రైల్వే ట్రాక్ మీదుగానే తమ రాకపోకలు సాగుతున్నాయన్నారు. ఈ మార్గం ద్వారానే పలు గ్రానైట్ క్వారీలకు వెళ్లే రోడ్డు అని, ఈ మార్గాన్ని మూసివేయడం తగదని హెచ్చరించారు. రైల్వే అధికారులు నిర్మించిన ఆండర్ పాసేజ్ మనుషుల రాకపోకలు తప్ప ఇంకా ఎందుకూ పనికిరాదని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక వాహనం గాని, మరేదైనా వాహనం గాని అండర్ పాసేజ్ ద్వారా రాలేవని అన్నారు. రైల్వే ట్రాక్ మీదుగా రోడ్డు మూసివేస్తే సుమారు 300 కుటుంబాలు సౌకర్యం కోల్పోవాల్సి వస్తుందన్నారు. సుమారు 1500 ఎకరాల వరిపంట పొలాలకు ఈ రోడ్డు సౌకర్యం కూడా ఉండదన్నారు. భవిష్యత్‌లో తమ పంట పొలాలకు బోర్లు వేయించుకోవాలన్నా... ప్రస్తుతం ఉన్న అండర్ పాసేజ్ రహదారి మీదుగా వాహనాలు రాని పరిస్థితి ఉందన్నారు. ఈ విషయంపై నాయకులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.



పరిశీలిస్తున్న రమణమూర్తి

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి - పలాస

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా భూగర్భ జల వనరులశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణమూర్తి ఆదేశించారు. మండలంలోని మామిడిమెట్టులో ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్, సచివాలయ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఇళ్లు నిర్మిస్తున్న లబ్ధిదారులు బిల్లులు చెల్లిస్తున్నామని అన్నారు. చెల్లింపు విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.రమేష్ నాయుడు, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, హౌసింగ్ ఎఇ వైకుంఠరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

పంట కీలక దశలో అప్రమత్తం

ప్రజాశక్తి - మెళియాపుట్టి

ప్రస్తుత వరి పంటలు పొట్ట దశకి చేరువలో ఉందని, ఈ దశ కీలకమని, రైతులు అప్రమత్తంగా వ్యవహరిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు లింగాల మధుబాబు అన్నారు. మండలంలోని పరుశురాంపురం రైతు సేవా కేంద్రం పరిధిలో ఆత్మ ఆధ్వర్యాన ఎఒ దానకర్తుడు అధ్యక్షతన శుక్రవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ యాజమాన్యం చేపట్టాలన్నారు. ఈ దశలో వరి పంటలో అనేక రకాల తెగుళ్లు పురుగులు ఆశించే అవకాశం ఉందని అన్నారు. అందుకు అనుగుణంగా రైతులు పొలాల్లో పరిశీలించి ఏదైనా సమస్యలు ఉన్న రైతు సేవ కేంద్ర అధికారిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్.వెంకటరావు, కెవికె శాస్త్రవేత్త కిరణ్‌కుమార్, సర్పంచ్‌లు తెంబూరు ప్రసాదరావు, ఈశ్వరరావు, కూటమి నాయకులు రామ్మూర్తి, రామకృష్ణుడు, దుర్యోధన, మోహనరావు, వ్యవసాయ సహాయకులు శరత్ కుమార్‌రెడ్డి, నరేంద్ర, సూర్య, లోకేష్ పాల్గొన్నారు.

పర్యటనను విజయవంతం చేయాలి

టెక్కలి : జాతీయ ఎస్‌టి కమిషన్ మెంబర్ హుసేన్ నాయక్ శనివారం పర్యటిస్తున్నారని, దీనిని విజయవంతం చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు వాబ యోగి ఒక ప్రకటనలో కోరారు. జలుమూరు మండలం మాకివలస, మెళియాపుట్టి మండలం కేరాసింగిగూడ గ్రామాల్లోని గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమం చేపట్టనున్నారని పేర్కొన్నారు. ఈ పర్యటన సందర్భంగా గిరిజనుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకునే నిమిత్తం సంఘాలు, నాయకులు పాల్గొవాలని కోరారు. మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటుతో పాటు డిడిఒ కార్యాలయం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ని దృష్టిలో పెట్టుకుని వినతిపత్రం సమర్పించనున్నామని తెలిపారు.



ఎంపికైన జట్టు

ముగిసిన క్రీడా పోటీలు

ప్రజాశక్తి - టెక్కలి

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో రెండు రోజులుగా నిర్వహించిన మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. మండలంలోని పది ఉన్నత పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ తెంబూరు గోవిందమ్మ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాడాన నారాయణరావు మాట్లాడుతూ మండలస్థాయిలో నిర్వహించిన క్రీడల్లో విజేతలుగా నిలిచిన వారు డివిజన్‌స్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒలు దల్లితులసీరావు రెడ్డి, దాసుపురం చిన్నారావు, వ్యాయామ ఉపాధ్యాయులు రాజా, కె.కె.రామిరెడ్డి, వెంకటరమణ, పాండవుల జగదీష్, కాపల రఘునాథరావు, రీతిసోనా, ఆదిశేషు, ఆలివేణి, దివ్యవాణి, నీలయ్య, రమేష్, మీనాక్షి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న గుప్త

వ్యాపార మెళకువలపై అవగాహన

ఇచ్ఛాపురం : వ్యాపారస్తులు కొత్త వ్యాపార పోకడలు అనుసరించి ముందుకెళ్లాలని నేషనల్ ట్రైనర్ ఎం.వి.కె.గుప్త అన్నారు. జెసిఐ వారోత్సవాలు సందర్భంగా స్థానిక విజె ఫంక్షన్ హాల్‌లో బిజినెస్ టూ బిజినెస్‌పై వ్యాపారస్తులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపారస్తులు ప్రస్తుత మార్కెట్ల పోకడలను అనుసరిస్తూ ఉండాలని సూచించారు. యువత వ్యాపార రంగంలో రాణించాలంటే వ్యాపారశైలిని అర్థం చేసుకుని ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో జెసిఐ అధ్యక్షులు షణ్ముఖరావు, సభ్యులు జయదేవ్, స్వరూప్‌కుమార్, ఢిల్లేషు, వెచ్చ, ప్రేమ్‌సాయి, రాజ్‌కమల్, సంతోష్, మధుకుమార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

26 బ్యాంకు ఖాతాలు ప్రారంభం

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

విద్యార్థులు బ్యాంకు అకౌంట్లపై అవగాహన కల్పించాలని కొలిగాం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.నరేంద్ర పట్నాయక్ అన్నారు. ఈ మేరకు పాఠశాలలో విశాఖ గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు విద్యార్థులకు అకౌంట్ ప్రారంభంపై శుక్రవారం అవగాహన కల్పించారు. బ్యాంకుల చుట్టూ అకౌంట్ల కోసం తిరగకుండా, ఇప్పటి నుంచే బ్యాంకు లావాదేవీలు, డబ్బులు జమ చేయడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో 26 ఖాతాలు తెలిపించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు శ్రీనివాస్, కృష్ణ, బ్యాంకు మిత్రులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు సిబ్బంది

పరమేశ్వరరావును ఇరికించడం తగదు



ఫిర్యాదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో ఈ నెల 10న ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదానికి బాధ్యుడిని చేస్తూ పేడాడ పరమేశ్వరరావుపై డిసిసి అధ్యక్షుడు అంబటి కృష్ణ శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం అభ్యంతరకరమని పార్టీ జిల్లా కార్యవర్గం తీర్మానించింది. పూర్వపు అధ్యక్షునిగా ఉన్న పరమేశ్వరరావు గత ఎన్నికల సమయంలో పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశారని, అటువంటి వ్యక్తిని జిల్లా అధ్యక్ష పదవినుంచి తప్పించడంతో పాటు తప్పుగా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయమని అదిష్టానం పెద్దలు ప్రేరేపించడం తగదని నాయకులు ఆక్షేపించారు. నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం పార్టీ జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ప్రస్తుత అధ్యక్షులు అంబటి కృష్ణ పార్టీ నాయకులకు బహిరంగ క్షమాపణ చెప్పారు. ఈ సమావేశానికి ఆముదాలవలస, ఇచ్ఛాపురం, పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు సనపల అన్నాజీరావు, మాసుపత్రి చక్రవర్తి రెడ్డి, కొప్పురోతు వెంకటరావు, కరిమజ్జి మల్లేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా వివిధ విభాగాల అధ్యక్షులు కోత మధుసూదన రావు, చింతాడ దిలీప్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా అగ్ని ప్రమాద ప్రదేశాన్ని పరిశీలించారు. అంబటి కృష్ణ మాట్లాడుతూ అగ్ని ప్రమాదానికి గత అధ్యక్షులు పరమేశ్వరరావు కారణమంటూ తాను రిపోర్టు ఇవ్వడం వెనుక పిసిసి అధినేత షర్మిల ఒత్తిడి ఉందని సమావేశంలో స్పష్టం చేశారు. కార్యాలయ సహాయకుడు సుధ తనకు తగిన సమాచారం ఇవ్వలేదని, జరిగిన పరిణామాలకు తనను క్షమించాలని సభ్యులను కోరారు. సమావేశం ముగిసిన అనంతరం కాంగ్రెస్ నేతలంతా మూకుమ్మడిగా డిఎస్‌పి కార్యాలయంలోనూ, మొదటి పట్టణ సిఐ పైడప్ప నాయుడులను కలిసి తప్పుడు ఫిర్యాదును ఉప సంహరించుకోవాలని కోరారు.

శతశాతం పొదుపు నిధులను వాడుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రభుత్వ సూచనల ప్రకారం రాష్ట్ర పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్), జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు మండలంలో శతశాతం పొదుపు నిధులను వాడుకుంటామని నూతన పాలకవర్గం అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య మహాజనసభలో నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన సమాఖ్య కార్యనిర్వాహక వర్గం గ్రామ సంఘం అధ్యక్షులు సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గ అధ్యక్షులు సభ్యులు మాట్లాడుతూ శత శాతం అన్ని సంఘాలలో గల పొదుపు నిల్వలను సంఘ సభ్యుల అవసరం మేరకు అప్పుగా వాడుకొని తిరిగి సంఘానికి రీపేమెంట్ చేయడానికి కొత్త పాలకవర్గం ప్రమాణం చేశారు. నూతన అధ్యక్షురాలుగా తమ్మినేని ధనలక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా రేణుక మొహరాన్, కార్యదర్శిగా బోనెల రోజా, ఉప కార్యదర్శిగా అన్నెపు సరోజిని, కోశాధికారిగా టేకి సూర్యకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా బొడ్డేపల్లి వేణమ్మ వ్యవహరించారు. ఎంపికైన కొత్త పాలకవర్గ సభ్యులతో ఎపిఎం పైడి కూర్మారావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మండల సమైక్య అకౌంటెంట్ రోజాతో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్ జగదీష్, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రత్యామ్నాయ మార్గం చూపాలి

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

టెక్కలి ఎన్‌టిఆర్ పార్కు నుంచి ఇందిరా గాంధీ కూడలి వరకు పట్టుమాదేవి గట్టుపై ఉన్న వీధి విక్రయదారులకు ప్రత్యామ్నాయ మార్గం చూపి తొలగించాలని సిపిఎం నాయకులు నంబూరి షణ్ముఖరావు డిమాండ్ చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యదర్శి కె.వి.వి.జగన్నాథరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా కురిసే సమయంలో పైనుంచి నీరు రావడం, కాలువ చిన్నది కావడంతో రోడ్‌పై ప్రవహించడం కాలువ నిర్మాణం జరిగిన తరువాత నుంచి రోడ్డు పైకి నీరు ప్రవహిస్తుందని అన్నారు. గతంలో టిడిపి ముసుగులో ప్రజామోదం, పంచాయతీ ఆమోదం లేకుండా చట్టవిరుద్ధంగా గట్టుపై నిర్మాణం ప్రారంభించారని విమర్శించారు. ఆ తరువాత వైసిపి అధికారం వచ్చేసరికి, ఆ నాయకులే వైసిపికి అనుకూలంగా ఉంటూ నిధులు సమకూర్చుకొని నిర్మాణాలు పూర్తి చేశారన్నారు. పూర్వం రైల్వే గేటు పక్కన ఉండే కాలువలకు పైనుంచి వచ్చే నీరు మార్గం మూసేశారన్నారు. పిల్ల కాలువ పైకి రోడ్‌పై నుంచి నీటి ప్రవాహం రావడమే అసల కారణమన్నారు. పేదలకు ప్రత్యామ్నాయ చూపకుండా అభివృద్ధి ముసుగులో పేదలపై దాడులు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఫుట్‌పాత్‌దారులు తోట సీతమ్మ, ఉర్జాన మాధవరావు, దండాసి కామేశ్వరరావు, కొత్తపల్లి చిన్నమ్మలు, కె.సూర్యనారాయణ, సిపిఎం నాయకులు కొల్లి యల్లయ్య, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి అనపాన షణ్ముఖరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - రణస్థలం

మండలంలోని రావాడ, రణస్థలంలో ప్రకృతి వ్యవసాయ రీజినల్ టెక్నికల్ అధికారి హేమ సుందరరావు, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం 1200 లీటర్ల జిల్లేడు ఆకు కషాయం తయారీ, ఉపయోగాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో జిల్లేడు ఆకుల ద్రావణం ఉపయోగించుకుని ఆరోగ్యకరమైన పంటను పండించవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సంధ్య, రాంబాబు, గంట్యాడ ఏసుబాబు, గ్రామ కార్యకర్తలు కేలం లక్ష్మి, సూర్యం, సురేష్, రైతులు పాల్గొన్నారు.



జిల్లేడు ఆకు కషాయం తయారు చేస్తున్న రైతులు

బంటుపల్లిలో

మండలంలోని బంటుపల్లిలో చాప ఈశ్వరరావు ఆరు ఎకరాల వరి పంటకు కావాల్సిన పోషకాల నిమిత్తం పిచకారి చేయుటకు 200 లీటర్ల ద్రవ జీవామృతాన్ని పదిమంది రైతుల సమక్షంలో శుక్రవారం రైతులకు తయారు చేయించారు. ఈ ద్రవ జీవామృతాన్ని నీటి ద్వారా పారించినట్లయితే ఎటువంటి రసాయన ఎరువులు ఉపయోగించకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంట పండించవచ్చునని యూనిట్ ఇన్‌ఛార్జి పెద్దింటి రాజేశ్వరి రైతులకు సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ గ్రామ కార్యకర్త గిడిజాల సూర్యకాంతం, రైతులు పాల్గొన్నారు.

17న నులిపురుగుల మాత్రల పంపిణీ


ప్రజాశక్తి - సరుబుజ్జిలి

జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని ఎంపిడిఒ పి.వి.వి.మురళీమోహన్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలో అన్ని పాఠశాలల్లో ఆల్‌బెండాజోల్ మాత్రలు విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు. నులి పురుగులు ఉన్న పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదల ఉండకపోవడం, కిషోర్ బాలికల్లో పోషకాహారం లోపం రక్తహీనత ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల ఉపాధ్యాయులకు ఆల్‌బెండాజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 కంచరాన శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు మాత్రలను పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ

పచ్చదనం ప్రాముఖ్యత తెలుసుకోవాలి



మొక్కలు నాటుతున్న వెంకట్ ఉజ్వల్

శ్రీకాకుళం అర్బన్: కాలుష్య నియంత్రణతో పాటు ప్రకృతిని కాపాడు కునేందుకు పచ్చదనం ప్రాముఖ్యతను ప్రజలు తెలుసుకోవాలని నెహ్రూ యువ కేంద్రం కో-ఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఝాన్సీ అగ్రికల్చరల్ అండ్ ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన బలగ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి మొక్కలు నాటడం వలన స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందని, పాఠశాల ఆవరణలో మొక్కలు ఉండడం వలన ఒత్తిడి, ఆందోళన నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు కీలకపాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎ.వి.మురళీకృష్ణ, రౌతు శంకరరావు, ఎన్.వై.కె.గణాంకాధికారి డి. శ్రీనివాసరావు, ఝాన్సీ అగ్రికల్చరల్ అండ్ ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రౌతు సుమతి మోహనరావు, జీవశాస్త్ర ఉపాధ్యాయులు పున్నయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు రాజేశ్వరి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

పొందూరు: రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం మండలంలోని బురిడికంచరాంలో శుక్రవారం యంగ్ స్టార్స్ యూత్ క్లబ్, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక సంయుక్తంగా విరాళాలను, బియ్యాన్ని సేకరించారు. గ్రామంలో విరాళాల సేకరణకు మండల టిడిపి కార్యదర్శి వండాన మురళి, ఇప్పిలి సూరయ్య సహకారాన్ని అందించినట్లు యంగ్ స్టార్ యూత్ క్లబ్ అధ్యక్షులు కాళ్లకూరి శాంతారాం తెలిపారు. కార్యక్రమంలో కుమిలి రాజేష్, బి.జనార్దనరావు, శ్రీను, అల్లంశెట్టి శ్రీనివాస్, దోరడ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

పని సర్దుబాటులో అధికారుల ఇష్టారాజ్యం

ప్రజాశక్తి - ఆమదాలవలస

పని సర్దుబాటు పేరిట ప్రాథమికోన్నత పాఠశాలలకు మంగళం పాడేటట్టు ప్రభుత్వ చర్యలున్నాయని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు యస్.వి.రమణమూర్తి అన్నారు. శుక్రవారం మండలంలోని తొగరాం పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కువ మంది విద్యార్థులుంటే ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరించడం చేయాలని లేనిపక్షంలో అలాగే ప్రాథమికోన్నత పాఠశాలగా కొనసాగించాలని, అందుకు విరుద్ధంగా విద్యార్థుల సంఖ్య తగ్గరాన్ని కారణంతో గతంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలోని బోధనా సహాయకులను తొలగించారని ఇపుడు సర్దుబాటు పేరిట ఉన్న భాషా పండిట్లను కూడా వేరే పాఠశాలలకు కేటాయిస్తే అక్కడ ఉన్న ప్రాథమికోన్నత తరగుతుల విద్యార్థుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులకు హిందీ, తెలుగు భాషలు భోధించేవారు ఎవరని, అసలు రానున్న విద్యా సంవత్సరంలో 6, 7, 8 తరగతుల్లో విద్యార్థులు చేరుతారా అన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. అధికారులు నిర్వాకం చూస్తుంటే రానున్న విద్యా సంవత్సరంలో ప్రాథమికోన్నత పాఠశాలలను మూసి వేసే ఆలోచనలో ఉన్నట్లు కనబడుతుందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు తీసుకున్న నిర్ణయాలు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేలా ఉండేలా చూడాలని, పాలక పెద్దలు పెండింగ్ ఎరియర్లు, డిఎలు, ఐఆర్‌లపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. పురపాలక పాఠశాలలో వెంటనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్‌టియు మండల నాయకులు రమేష్, రమణమూర్తి, రామచంద్ర ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి

ఎస్‌ఐలుగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా వెలిచేటి సందీప్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ చిరంజీవి రణస్థలం బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన ఈయనకు స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ఎస్‌ఐగా వి.సత్యన్నారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పోలాకి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పని చేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన షేక్‌మహ్మద్ అలీ బదిలీపై నందిగాం బదిలీపై వెళ్లారు. నూతన ఎస్‌ఐకి సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అంతకుముందు స్థానిక కొత్తమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు.



సందీప్‌కుమార్ సత్యనారాయణ నారాయణస్వామి

నౌపడ : నౌపడ పోలీస్ స్టేషన్ నూతన ఎస్‌ఐగా జి.నారాయణస్వామి బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్థానంలో పనిచేసిన కిషోర్‌వర్మ బదిలీపై వెళ్లారు. ప్రస్తుత ఎస్ఐ నారాయణస్వామి కోటబొమ్మాళి, హిరమండలం, నరసన్నపేట, బారువ ఎస్‌ఐగా పనిచేశారు. ముందుగా సిబ్బంది పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు.



రణస్థలం : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న యాత్రికులు

ప్రజాశక్తి - రణస్థలం

మండల కేంద్రంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో వినాయక చవితి ముగింపు వేడుకలను పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ కమిటీ శుక్రవారం భారీ అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 5 వేల మంది యాత్రికులు అన్న సంతర్పణలో పాల్గొన్నారు. దాతల సహాయ సహకారాలతో అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని అన్న సంతర్పణ చేశారు. టిడిపి నాయకులు, కమిటిసభ్యులు పాల్గొన్నారు.

నరసన్నపేట : వరసిద్ధి వినాయక నవరాత్రుల

పలుచోట్ల అన్నదానం

మహోత్సవాలు సందర్భంగా శుక్రవారం పట్టణంలో జగన్నాథపురం, శివనగర్ కాలనీ వీధుల్లో కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. ఈ అన్నదానంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. అనంతరం స్వయంగా యాత్రికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు కింజరాపు రామారావు, పీస కృష్ణ, కోట అప్పలస్వామి, కేలం చిరంజీవి, చలపాక మల్లి, బోయిన నరసింహమూర్తి, గొలివి రామారావు, చింతు రమణ, వరద రాజులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్


సిక్కోలులో 'భలే ఉన్నాడే' హడావుడి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

యువ హీరో రాజ్ తరుణ్, హీరోయిన్ మనీషా కంద్కూర్ జంటగా నటించిన భలే ఉన్నాడే సినిమా ప్రేక్షకులను అలరించింది. సినిమా చూసిన వారంతా భలే ఉందంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు మారుతి సమర్పకుడిగా జె.శివ సాయి వర్ధన్ దర్శకత్వంలో శ్రీకాకుళానికి చెందిన వ్యాపారవేత్త నారాయణశెట్టి కిరణ్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించారు. రవికిరణ్ ఆర్ట్స్ పేరుతో ఈ సినిమాను నిర్మించారు. సినిమా శుక్రవారం విడుదలైన సందర్భంగా నగరంలోని ఆ చిత్రం ప్రదర్శితమైన సన్‌మ్యాక్స్ వద్ద సందడి నెలకొంది. చిత్ర నిర్మాత స్వస్థలం శ్రీకాకుళం కావడంతో ఆయన మిత్ర బృందం సన్‌మాక్స్‌ను సందర్శించి సందడి చేశారు. నిర్మాతగా ఉన్న కిరణ్ కుమార్ థియేటర్ వద్ద కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు.



కేకు కట్ చేసి సందడి చేస్తున్న నిర్మాత కిరణ్ కుమార్



ఘాట వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ప్రకాష్ లేని లోటు పూడ్చలేనిది

ప్రజాశక్తి - కవిటి

ఉద్దానం ప్రాంతం పురోభివృద్ధికి నిరంతరం శ్రమించిన ఆంధ్రా బ్యాంకు మాజీ డైరెక్టర్ బెందాళం ప్రకాష్ లేనిలోటు పూడ్చలేనిదని జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్ అన్నారు. ప్రకాష్ వర్ధంతి సందర్భంగా రామయ్యపుట్టుగలోని ప్రకాష్ ఘాట్ వద్ద టిడిపి నాయకులు, గ్రామస్తులు శుక్రవారం నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్దానం ప్రాంతం ముద్దుబిడ్డగా ఎప్పటికీ ఆయన ప్రజల గుండెల్లో నిలిచి ఉంటారని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆరింగి మధు, ఆరింగి త్రివిక్రమరావు, బార్ల చినబాబు, బెందాలం కామరాజు, వజ్జ రంగారావు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గ రైల్వే గేట్ నుంచి చినబాడం వైపు వెళ్లే రహదారిని చిన్నబాడాంకు చెందిన ప్రొక్లెయినర్ యాజమాని గోనప నిరంజన్ తన సొంత నిధులు, వాహనంతో శుక్రవారం రోడ్డు మరమ్మతులు చేయించారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడేవారు. వారి ఇబ్బందులను గుర్తించి సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో ప్రొక్లెయినర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ఢిల్లీరావు హర్షం వ్యక్తం చేశారు.



మరమ్మతులు చేస్తున్న నిరంజన్

కుమార్‌రాజుకు ప్రశంసాపత్రం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఐఎస్ఒ గుర్తింపు పొందిన ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ నాన్‌స్టాప్ కార్యక్రమాలతో 28 ప్రపంచ రికార్డులు కైవసం చేసుకున్న అతి పెద్ద ఏకైక సంస్థ శ్రీశ్రీ కళా వేదిక నిరంతర సాహితీ ప్రభంజనం ప్రతీ నెలా సాహితీ క్రతువులో భాగంగా తెలుగు జాతి కీర్తి శిఖరం ఎన్‌టిఆర్ అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ కవితా పోటీలో ప్రతిభ కనబరిచిన శ్రీకాకుళం జిల్లా శ్రీశ్రీ కళా వేదిక కార్యదర్శి బుర్రి కుమార్ రాజును శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ అధ్యక్షులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కొల్లి రమావతి, చిట్టే లలిత, ఈశ్వరీ భూషణం, శ్రీశ్రీ కళా వేదిక అధ్యక్షులు ఈ వేమన, సాహితీ మిత్రలు జంధ్యాల శరత్ బాబు, ఉమ, వావిలపల్లి రాజారావు, జిల్లా గ్రంథాలయ ఉప గ్రంథ పాలకులు వి.వి.జి.ఎస్. శంకరరావు, జిల్లా గ్రంథాలయ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

ప్రజాశక్తి - మెళియాపుట్టి

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని మర్రిపాడు-సి సర్పంచ్ రవ్వల గణపతిరావు అన్నారు. మండలంలోని మర్రిపూడి-సి పంచాయతీ జలకలింగుపురంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ రకాల మొక్కలు నాటి మొక్కల ప్రాధాన్యతను వివరించారు. ప్రతి వ్యక్తీ మొక్క నాటడంతో పాటు సంరక్షించాల్సిన బాధ్యతను తీసుకోవాలన్నారు. అలాగే గ్రామంలోని డ్రయినేజీల్లో పూడికలు తీసి బ్లీచింగ్ వేశారు. కార్యక్రమంలో డేవిడ్ సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంఎంఎస్ అధ్యక్షులుగా వెంకటలక్ష్మి

ప్రజాశక్తి - పోలాకి

మండలంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షులుగా కొయ్యాన వెంకటలక్ష్మి ఎంపికైనట్లు ఎపిఎం జి.రాజారావు తెలిపారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎపిఎం ఆధ్వర్యాన నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా పోలాకికి చెందిన కొయ్యాన వెంకటక్ష్మి అధ్యక్షులుగా, తలసముద్రంకు చెందిన ముద్దపు మోహిని ఉపాధ్యక్షులుగా, మభగాంకు చెందిన శిమ్మ లక్ష్మి, నిక్కు సింహాద్రి, కార్యదర్శులుగా డి.ఎల్.పురానికి చెందిన గొర్లె పార్వతి కోశాధికారిగా, గొల్లలవలసకు చెందిన శిర్ల రాములమ్మ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. అనంతరం సభ్యులు ప్రమాణస్వీకారం చేయించారు.